క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఈనెల 2న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. సోమిడి, విద్యానగర్ కాలనీ, సెయింట్ ఆన్స్ స్కూల్, మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మెజార్టీతో గెలుస్తాం..



పరకాల: అసెంబ్లీ ఎన్నికల్లో 20వేల మెజారిటీతో విజయం సాధిస్తామని బీజేపీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, సాంబయ్య శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ఉన్న వ్యతిరేకతతో ప్రజలు బీజేపీకి ఓటేసి గెలిపించేందుకు కృషి చేశారని అన్నారు. ఉచిత వాగ్దానాలను నమ్మలేని పరిస్థితుల్లో ప్రజలు కేంద్రంలోని బీజేపీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, నాయకులు దుబాసి వెంకటస్వామి, ఖాసాని సోమరాజ్, ఏకు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యశస్వినిరెడ్డి గెలుపు ఖాయం



రాయపర్తి: పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేశారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యానాయక్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పాటుపడ్డారంటూ కార్యకర్తలకు, ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోవడంతో కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి 20 వేల మెజార్టీతో గెలవడం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. యశస్వినిరెడ్డి మంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు సరికొండ కృష్ణారెడ్డి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, పెండ్లి మహేందర్‌రెడ్డి, ఎనగందుల మురళి, మచ్చ నీలయ్య, కుంట రమేశ్, కుందూరు గోపాల్‌రెడ్డి, కిషన్, మూనావత్ రవి, మచ్చ రమేశ్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



అఫ్జల్ బీ (ఫైల్)

చెన్నారావుపేట: మండలంలోని బోజెర్వు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు షేక్ అఫ్జల్ బీ (105) శుక్రవారం మృతి చెందింది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆమె మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన పలువురు ఆమె మృతదేహానికి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలికి కూతురు యాకూబీ, కుమారుడు షేక్ హాజీపాషా, మనుమరాళ్లు ఉన్నారు.

వరికొయ్యలను కాలిస్తే నష్టమే



రాయపర్తి: వరికొయ్యలను కాలిస్తే నష్టాలు తప్పవని ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు రావుల భాస్కర్‌రావు తెలిపారు. మండల కేంద్ర శివారులోని పంట పొలాల్లోని వరిగడ్డిని కొందరు రైతులు కాల్చుతుండగా ఆయన అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. వరిగడ్డిని నేల సంపదగా అభివర్ణించారు. గడ్డిని కాల్చితే భూమిలోని ఖనిజాలు, లవణాలు దెబ్బతిని భూసారం కోల్పోతుందని తెలిపారు. రెండు, మూడు పంటలు తీశాక వరిగడ్డిని కాల్చితే పంటల దిగుబడి రాకుండా చవిటి నేలలుగా మారిపోతాయని చెప్పారు.

ఆర్థికసాయం అందజేత

నెక్కొండ: గొట్లకొండకు చెందిన మాలోతు స్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి స్వామి చిన్ననాటి మిత్రులు శుక్రవారం రూ.50 వేల సాయం అందించారు. స్వామితోపాటు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 2004–05 విద్యాసంవత్సరంలో చదువుకున్న మిత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం స్వామి భార్య పద్మకు రూ.50 వేలు అందజేశారు. స్వామి మిత్రులు ప్రసాద్, రఘుమోహన్, శ్రీను, రమేశ్, రాజశేఖర్, రవి, రంజిత్, అక్బర్, అశోక్, వెంకటేశ్, స్వజన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'పశ్చిమ'లో నమోదైన పోలింగ్

- 167లో అత్యధికం.. 204లో అత్యల్పం
- సోమిడిలోని బూత్‌లో 81శాతం పోలింగ్
- 204వ బూత్‌లో 34శాతమే..

56.59శాతం



జులైవాడలోని ప్రభుత్వ పాఠశాలలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

హన్మకొండ అర్బన్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 56.59శాతం పోలింగ్ నమోదు కాగా, హనుమకొండ జిల్లా సగటు పోలింగ్ 68.80గా ఉంది. నియోజకవర్గంలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లోని బూత్ నంబర్ 204లో 34.50శాతం అతి తక్కువ పోలింగ్ నమోదైంది. ఇక్కడ మొత్తం 571 మంది ఓటర్లుండగా వారిలో 197మంది మాత్రమే ఓటు వేశారు. పురుషులు 283మందికి గాను 107మంది, మహిళలు 288కి కేవలం 90మంది మాత్రమే తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోనే అత్యంత తక్కువ పోలింగ్ శాతం ఇక్కడే నమోదైంది. నయీంనగర్‌లోని అప్పర్ ప్రైమరీ స్కూల్ బూత్ నంబర్ 230లో 38.19 శాతం పోలింగ్ నమోదైంది.

అత్యధిక పోలింగ్ సోమిడిలోని 167లో..

నియోజకవర్గంలోని సోమిడి ప్రభుత్వ హైస్కూల్‌లోని బూత్ నంబర్ 167లో మొత్తం 1,064ఓటర్లు ఉండగా 871మంది ఓటు వేశారు. అత్యధికంగా 81.86శాతంగా పోలింగ్ నమోదైంది. అక్కడే ఉన్న ఇంకో 168వ నంబర్ బూత్‌లో 1,161ఓటర్లకు గాను 938మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 80.79గా పోలింగ్ నమోదైంది.

న్యూశాయంపేటలో 80శాతంపైగా..

న్యూశాయంపేటలోని బూత్ నంబర్ 108లో 795మంది ఓటర్లు ఉండగా 644మంది ఓటు వేశారు. 81.01గా పోలింగ్ నమోదైంది. 109, 120, 125, 121, 133, 244, 166 పోలింగ్ బూత్‌లలో 70శాతానికిపైగా పోలింగ్ నమోదైంది.

తూర్పులో 182వ బూత్‌లో 100%

ఉర్సులోని సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లోని బూత్‌లో అధికం



నగరంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళా ఓటర్లు (ఫైల్)

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 230 పోలింగ్ కేంద్రాల్లో అధికంగా ఉర్సులోని సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 182 పోలింగ్ బూత్‌లో 1,152 మంది(100శాతం) ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యల్పంగా ఎల్‌బీనగర్‌లోని 89 పోలింగ్ బూత్‌లో 620 మంది ఓటు వేయాల్సి ఉండగా.. 349 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. తూర్పు నియోజకవర్గంలో మొత్తం 2,54,641 మంది ఓటర్లుండగా.. నవంబర్ 30న జరిగిన పోలింగ్‌లో 1,70,274 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రేపు సత్యనారాయణ స్వామి వ్రతాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ట్రస్టీలు

వరంగల్: ములుగురోడ్డు సమీపంలోని సద్గురు ధామంలో ఈనెల 3వ తేదీన ఉదయం 8గంటల నుంచి మహాగణపతి హోమం, సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. గురుధామంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామూహిక వ్రతాల్లో పాల్గొనే వారు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని చెప్పారు. పూజా ద్రవ్యాల్లో ఇంట్లో పూసిన పూలు, పండ్లు మాత్రమే తీసుకురావాలని, మిగిలిన ద్రవ్యాలు ఆవు నెయ్యి, ఆవు పాలు, ఆవు పెరుగు, వ్రతానికి సంబంధించిన పూజా ద్రవ్యాలను ఉచితంగా సమకూరుస్తామని వివరించారు. ఈ కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి అనేక మంది శివానంద మూర్తి గురువు భక్తులు హాజరు కానున్నారని చెప్పారు. మరో ట్రస్టీ బండారు సాయి నారాయణ మాట్లాడుతూ భక్తులు ఇంట్లో పూజ చేసుకుంటే అది ఒక వ్రత ఫలితమే వస్తుందని, సామూహికంగా అందరూ కలిసి వ్రతం లేదా పూజ చేసుకుంటే అన్ని ఫలాలు వస్తాయని అన్నారు. అనంతరం వ్రతానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

మద్యం షాపును తొలగించాలి

- గ్రామస్తుల ఆందోళన



మద్యం షాపు ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కమలాపూర్: మండలంలోని అంబాలలో గల మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని గ్రామస్తులు, కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మద్యం షాపు ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబాల ప్రధాన రహదారి సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సేవించిన మందుబాబులు రోడ్లపై మల, మూత్ర విసర్జన చేస్తుండటంతో స్థానికంగా నివసించే మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధాన రహదారి పక్కనే మద్యం దుకాణం ఉన్న కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కొందరు మద్యం మత్తులో మహిళలపై అఘాయిత్యాలకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మద్యం దుకాణాన్ని ఎత్తి వేయాలని కోరుతూ ఆగస్టులో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని, స్పందించిన కలెక్టర్ మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తీసేస్తామని చెప్పారని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కానీ ఇప్పటి వరకు తొలగించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని వెంటనే మరోచోటకు తరలించాలని కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాయంపేట : మండలంలోని పత్తిపాక రవీంద్రభారతి పాఠశాలలో 2009–10 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం వారికి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నకిరబోయిన కుమారస్వామి, ఉపాధ్యాయులు శేషాద్రి మల్లయ్య, వీరగాని సత్యం, పసునూటి రమణయ్య, ఐరబోయిన భిక్షపతి, బండ నిరంజన్‌రెడ్డి, వైద్యుడు తిరుపతిరెడ్డి, కందగట్ల హరికృష్ణ, ఎర్ర రాకేష్‌రెడ్డి, ప్రకాష్, విద్యార్థులు శ్రీకాంత్, ప్రశాంత్, రమేష్, శృతి, దివ్య, గీత, మహేష్, సింధుజ, రజిత, రాజు, కిరణ్, శ్వేత, వెంకటేశ్, రజనీకర్, సరిత, సాయిరాం, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



కాజీపేట అర్బన్: అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ దయాకర్



హసన్‌పర్తి: ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు, అధ్యాపకులు

కాజీపేట అర్బన్: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వరంగల్ వెస్ట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.దయాకర్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హంటర్ రోడ్డులోని డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులతో కలిసి ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దయాకర్ మాట్లాడుతూ అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వేముల రమ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక, అధ్యాపకులు గీత, శైలజ, దీప్తి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

హసన్‌పర్తి: ఎయిడ్స్ డేను పురస్కరించుకుని ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీని హసన్‌పర్తిలోని తెలంగాణ బాలికల గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినులు నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని వివరించారు. వ్యాధి వ్యాప్తి, నివారణపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ అపోహలను విడనాడాలని, వ్యాధిగ్రస్తులకు ధైర్యం చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మహబూబాబాద్ రూరల్ : త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి మంగళాశాసనములతో శ్రీసీతాలక్ష్మణహనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి వారి తృతీయ వార్షికోత్సవ వేడుకలు మండలంలోని రెడ్యాలలో శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. సర్పంచ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, విజయకాంత్ రెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో మొదటి రోజు సామూహిక శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణ, అంకురారోపణ పూజలు జరిపి, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి యాగశాలలో ద్వారతోరణ, ధ్వజస్తంభ ఆరాధన, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర యజ్ఞం, పూర్ణాహుతి, బలిహరణ పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తామని, సోమవారం ఉదయం యాగశాలలో మహా సుదర్శన యాగము, మహాపూర్ణాహుతి, నవకలశ స్నపనం, చక్రస్నానం, మహా కుంభప్రోక్షణ, ఋత్విక్ సన్మానము, ఆశీర్వచనము, ఉత్సవ సమాప్తి జరుగుతుందని తెలిపారు. రెడ్యాల గ్రామంలోని ప్రజలందరిని అనుగ్రహించడానికి శ్రీ సీతారామచంద్రస్వామి వారు గ్రామంలోకి విచ్చేసి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తుందని, ప్రతిష్ఠ రోజును పురస్కరించుకుని నాలుగు రోజులు ఉత్సవాలు జరపాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి



బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తున్న ఆపరేటర్

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కొత్తగా ఆధార్ కార్డ్, కార్డులోని తప్పుల సవరణలు, మొబైల్ నంబర్ లింక్, చిరునామా మార్పు, పుట్టిన తేదీ, పేరు, ఇంటిపేరు మార్పు వంటి సవరణలకు సరైన ఆధారాలతో సెంటర్‌కు వచ్చి సవరించుకోవచ్చని సూచించారు. వివరాలకు 9494729272లో లేదా ఆధార్ కేంద్రాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న ఉదయ్‌కిరణ్

కరీమాబాద్: శాసనసభ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి అంబాల ఉదయ్‌కిరణ్ అభిప్రాయపడ్డారు. గ్రేటర్ పరిధిలోని 43వ డివిజన్ మామునూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేశ్ మంచి మెజారిటీతో గెలవడమే కాకుండా రాష్ట్రంలో మూడవసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల విషయంలో ప్రజలు సంతృప్తిగా ఉన్నందున మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి ఖాయమని అన్నారు. ఎగ్జిట్ పోల్స్ వెల్లడించిన వివరాలు సత్యదూరమన్నారు. సమావేశంలో నాయకులు జమీర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

4నుంచి శివాలయ ప్రతిష్ఠాపన



శివాలయ ప్రతిష్ఠాపనోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దామెర: మండలంలోని వెంకటాపూర్‌లో ఈనెల 4వ తేదీన నుంచి 7వ తేదీ వరకు శివాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పున్నం సంపత్ శుక్రవారం తెలిపారు. ఆలయ ఆవరణంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామంలోని పురాతన శివాలయాన్ని దాతల సహకారంతో పునఃనిర్మించుకోవడం జరిగిందన్నారు. 4న గణపతి పూజ, పుణ్యహవాచనం, 5న యాగశాల, అంకురారోపణం, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 6న నూతన ప్రతిష్ఠామూర్తుల అభిషేకాలు, జలాధివాసం, నవగ్రహ రుద్రహోమం, సామూహిక కుంకుమార్చనలు ఉంటాయన్నారు. 7న ఉదయం 8.49 గంటలకు యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠతో పాటు దిష్టి కుంభం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అంకూస్, శ్రీనివాస్, సంపత్‌కుమార్, సదాశివుడు, కైలాష్, రాజు, రమేష్, రవీందర్, రాజ్‌కుమార్, రజనీకాంత్, బాబురావు, శ్రీధర్, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పునర్వసు నక్షత్ర పూజలు



మడికొండ: రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కాజీపేట: సుదర్శన నర్సింహ హోమం చేస్తున్న అర్చకులు

మడికొండ: శ్రీరాముడి జన్మనక్షత్రం పునర్వసు నక్షత్రం సందర్భంగా మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంపై ఉన్న సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం విశేష పంచామృతాలతో అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో శ్రీరామ మూలమంత్ర హోమం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, అర్చకులు పరాశరం విష్ణువర్ధనచార్యులు, రాగిచేడు అఖిలాష్‌శర్మ, పారుపల్లి సత్యనారాయణశర్మ, సిబ్బంది రామకృష్ణ, శ్రీదేవి, భాస్కర్, భక్తులు వెంకటేశ్వర్లు, వెంకన్న, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్వేతార్కలో సుదర్శన నర్సింహ హోమం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు శుక్రవారం సుదర్శన నర్సింహ హోమం నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు హోమం జరిపించారు. ఈ కార్యక్రమంలో సాయికృష్ణ శర్మ, ఆనంద్ త్రిపాఠి, హర్షిత్ త్రిపాఠి, శివం శుక్ల, హరిస్వామి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో 86.13శాతం పోలింగ్

వర్ధన్నపేట : మండలంలో 38,510 ఓటర్లు ఉండగా 33,171 మంది ఓటు వేశారు. 86.13 శాతం పోలింగ్ నమోదైంది. వర్ధన్నపేటలోని 12 డివిజన్లలో 10,158 మంది ఓటర్లు ఉండగా 8,647 మంది ఓటు వేశారు. చెన్నారంలో 1,592, కాపుగూడెంలో 420, బండౌతపురంలో 1,269, అంబేద్కర్‌నగర్‌లో 707, దమ్మన్నపేటలో 2,802, దివిటిపల్లిలో 569, రామవరంలో 1,105, కొత్తపల్లిలో 1,413, ల్యాబర్తిలో 2,324, ఇల్లందలో 4,294, కడారిగూడెంలో 644, కట్ర్యాలలో 1,885, కుమ్మరిగూడెంలో 614, ఉప్పరపల్లిలో 1662, నల్లబెల్లిలో 2,219, రాందన్‌తండాలో 1,005ఓట్లు పోలయ్యాయి.

సంగెం: మండలంలో 86.83 శాతం పోలింగ్ నమోదైందని ఏఆర్ఓ రాజ్‌కుమార్ తెలిపారు. వెంకటాపూర్‌లో 1042, కాట్రపల్లిలో 2015, చింతలపల్లిలో 1689, కృష్ణానగర్‌లో 477, పల్లారుగూడలో 2901, మొండ్రాయిలో 2735, నార్లవాయిలో 1068, నల్లబెల్లిలో 1576, ఎల్గూర్‌రంగంపేటలో 3061, తిమ్మాపూర్‌లో 863, సంగెంలో 2309, కుంటపల్లిలో 1800, కొత్తగూడెంలో 616, గాంధీనగర్‌లో 512, గవిచర్లలో 3258, కాపులకనిపర్తిలో 1329, ఆశాలపల్లిలో 1399, రామచంద్రాపురంలో 1618, లోహితలో 1733, షాపూర్‌లో 1012, తీగరాజుపల్లిలో 1821 ఓట్లు పడ్డాయి.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఐనవోలు: ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వడానికి గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను శుక్రవారం అందించారు. అనంతరం సిద్దార్థరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం యువతులకు వివాహం అయినప్పటి నుంచి ప్రసూతి అయ్యే వరకు అండగా నిలుస్తోందని తెలిపారు. వారికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మందులను కూడా అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు ఆయా గ్రామాల ఆశవర్కర్ల వద్ద పేర్లను నమోదు చేసుకోవాలని, ప్రతినెలా ప్రభుత్వ ఆస్పత్రిలోనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవళిస్టెల్లా, సృజన, సూపర్‌వైజర్లు అన్నాంబిక, జంగయ్య, సిబ్బంది శ్వేత, బొడ్డు శ్రీనివాస్, లత, లలిత ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి. చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (కాజీపేట)